సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 6 । జనవరి । 2023



హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: బండి ముత్యాలమ్మ హుండీని గురువారం లెక్కించగా 50 రోజులకు రూ.10,32,665 ఆదాయం లభించినట్లు **ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు.**




అట్టహాసంగా తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: చినవెంకన్న తిరువీధి సేవ అట్టహాసంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా రథోత్సవం

తాడేపల్లిగూడెం(టీఓసీ): కొబ్బరితోటలో వేంచేసి యున్న పుంతలో మునలమ్మ తల్లి రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

జగనన్న సచివాలయం కో–ఆర్డినేటర్‌గా ప్రతాప్‌రెడ్డి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ **అధ్యక్షుడు** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల **మేరకు పార్టీ** కేంద్ర కార్యాలయం జగనన్న స**చివాలయాల** రాష్ట్ర కో–ఆర్డినేటర్లను నియమిస్తూ **గురువారం** ఉత్తర్వులు జారీ చేసింది. జోన్–**2లోని ఐదు** జిల్లాలకు సంబంధించి కో–ఆర్డినేటర్‌గా పుత్తా ప్రతాప్‌రెడ్డిని నియమించారు. ఆయన ఏలూరు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఆయన పరిధిలో 2787 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా వాటిలో 8,361 మంది సచివాలయ కన్వీనర్లు, 1,02,034 మంది గృహ సారథులు పనిచేస్తారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్‌గా జాన్సన్



మేడిది జాన్సన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్‌గా పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన మేడిది జాన్సన్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను జాన్సన్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కష్టపడుతున్న జాన్సన్‌కు పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చిందని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. జాన్సన్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

10న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఉండి: ఈ నెల 10న ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎల్అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. ఇంటర్వ్యూలకు 2020–21, 2021–22 విద్యాసంవత్సరంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడుల్లో రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన వారు, అలాగే వెల్డర్ ఏడాది కోర్సు పూర్తి చేసిన వాళ్ళు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 10 వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని శ్రీనివాసరాజు తెలిపారు.

ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు స్వీయ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ప్రసంశనీయమని ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె ప్రసూన అన్నారు. నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఆర్ఆర్‌డీఎస్ విద్యార్థులు బి.చిరంజీవి, డి.ఎలీషా రెండో స్థానంలో నిలిచి రజత పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వ్యాయామ అధ్యాపకుడు మున్ను శివ రామరాజును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, జి.ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎస్టీయూ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశమైంది. ఫ్యాప్టో చైర్మన్‌గా బీహెచ్ జవహర్‌లాల్ రాజును(ఎస్టీయు), సెక్రటరీ జనరల్‌గా బి.కార్తీక దామోదర్‌ను (డిటిఎఫ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా పీఎస్ విజయరామరాజు(యూటీఎఫ్), జి.ప్రకాశం(ఏపీటీఎఫ్), సెక్రటరీలుగా సీహెచ్ పట్టాభి రామయ్య, పి.జనార్ధన స్వామి, కోశాధికారిగా వి.జనార్దన్ రావు, కార్యవర్గ సభ్యులుగా ఏకేవీ రామభద్రం, కె.వి.రామ చంద్రరావు, బీవీ నారాయణలను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు చేయూత

- వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా లబ్ధి
- కార్లు, ట్రాక్టర్లు, జేసీబీలు కొనుగోలుకు రుణసదుపాయం
- వాహనాల అద్దె ద్వారా యువతకు ఉపాధి
- రెండు జిల్లాల్లో రూ.15 కోట్లకు పైగా అందజేత



ఏలూరు(మెట్రో): ఔత్సాహిత పారిశ్రామికవేత్తలుగా యువతను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ×వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం₹ పథకాన్ని అమలు చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు మూతబడిన పరిశ్రమలకు ఇన్సెంటివ్‌లు అందించి వాటిని తెరిపించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా పరిశ్రమలపై ఆధారపడిన వారికి ఉపాధి చూపించింది. ప్రస్తుతం ప్రభుత్వం మరో బృహత్తరమైన ఆలోచన చేసి వాహనాల ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అవకాశం కల్పించి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోంది.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రుణ సదుపాయం

డ్రైవింగ్ వచ్చిన యువత ఉపాధి పొందేందుకు జిల్లా పరిశ్రమల శాఖ వాహన రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు పాటు వాహనాల ద్వారా ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ (ఐడీపీ), ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషనల్ పాలసీ(ఐఐపీపీ)లో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన వాహనాలను ప్రభుత్వం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా కార్లు, వ్యాన్‌లు, ట్రాక్టర్లు, లారీలు, జేసీబీలు, ఎక్సవేటర్లు వంటి వాటికి సబ్సిడీ అందించి తద్వారా వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. ఆయా వాహనాలను, యంత్రాలను అద్దెకు ఇచ్చి వాటితో ఆదాయం పొందడంతో పాటు మరికొంతమందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంది. ఈ పథకం ద్వారా గతంలో రుణం దాటేస్తున్న బ్యాంకులు ప్రస్తుతం రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

బ్యాంకు రుణంతో పాటు సబ్సిడీ

45 శాతం సబ్సిడీ ఇవ్వడంతో లబ్ధిదారులు సైతం ముందుకు వస్తున్నారు. లబ్ధిదారులు తమ వాటాగా వాహనం ఖరీదులో 10 నుంచి 20 శాతం చెల్లించాలి. బ్యాంకు రుణంతో వాహనం కొనుగోలు చేశాక, పరిశ్రమల శాఖ రాయితీ అందిస్తుంది.

ఇంతవరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 2020–23లో జగనన్న బడుగు వికాసం ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలో 29 వాహనాలు అందించగా, వీటికి రూ. 2,68,97,130 సబ్సిడీ రూపంలో మంజూరు చేశారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో 165 వాహనాలను అందించగా, వీటికి రూ. 13,10,00,000 సబ్సిడీ రూపంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విధంగా ఎస్సీ, ఎస్టీ యువతను ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

యువత ఉపాధికి సాయం



వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఎంతో మేలు చేకూరుతోంది. ఎస్సీ, ఎస్టీ యువత ఉపాధి పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. వాహనాల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడంతో వాహనాలు కొనుగోలు చేసిన వారు అద్దెకు తిప్పుకుంటూ జీవనోపాధి పొందే అవకాశం ఏర్పడుతోంది.

– పి.ఆదిశేషు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి, పశ్చిమ గోదావరి జిల్లా

45 శాతం రాయితీ అందిస్తున్నాం



45 శాతం రాయితీ ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. వారు జీవనోపాధి పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. అద్దె ప్రాతిపదికన వాహనాలు తిప్పుకోవడం వల్ల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వారికి వివిధ రాయితీలు కల్పిస్తోంది.

– పి.ఏసుదాసు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్, ఏలూరు జిల్లా

ఉద్యాన వర్సిటీలో క్రీడా సంబరాలు



ప్రారంభ కార్యక్రమంలో వీసీ జానకిరామ్, అతిథులు

తాడేపల్లిగూడెం: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలనే స్ఫూర్తిని ఆటలు నేర్పిస్తాయని రిటైర్డ్ ఐజీ ఆఫ్ పోలీస్, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మల్లారెడ్డి అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలోని ఎనిమిది ఉద్యాన కళాశాలల విద్యార్థుల క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మల్లారెడ్డి, వీసీ టి.జానకిరామ్, భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ రైతు పక్షపాతి, లెజెండ్ లీడర్ వైఎస్సార్ స్థాపించిన ఉద్యాన విశ్వవిద్యాలయంలో కార్యక్రమాలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. భారత అంధుల క్రికెట్ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని, అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వీసీ జానకీరామ్ మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. తొలిరోజు పోటీల్లో 800 మీటర్ల పరుగు పోటీల్లో ఎస్.విజయకుమార్ (వెంకట్రామన్నగూడెం), బి.మనీష (అనంతరాజుపేట), షాట్‌పుట్‌లో బి.శ్రీదేవి (వెంకట్రామన్నగూడెం), సీహెచ్ శ్రావణి (పార్వతీపురం) విజేతలుగా నిలిచారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో కొత్తగా మంజూరైన పింఛన్ అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: అర్హులందరికీ పింఛన్లు, రైస్ కార్డులు ప్రభుత్వం నిరంతరాయంగా అందచేస్తూనే ఉందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో గురువారం తణుకు మున్సిపాలిటీ, తణుకు మండలంలోని లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక, కొత్త రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమం అందించాలని కలెక్టర్లకు చెప్పిన మొట్టమొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. అర్హత ఉండి నాకు ఈ పథకం అందలేదని ఏ ఒక్కరూ అనకూడదని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారని స్పష్టం చేశారు. గతంలో జన్మభూమి కమిటీలు విపరీతమైన అవినీతికి పాల్పడ్డాయని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అవినీతిరహితంగా సంక్షేమాన్ని అర్హులందరికీ అందిస్తున్నారని అన్నారు. సొంత కుటుంబసభ్యులు కూడా చేయలేని సాయాన్ని జగనన్న అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలకు అందిస్తున్నారన్నారు.

టీడీపీది దుష్ప్రచారం : అర్హత ఉన్న వారందరికీ సంక్షేమం అందుతుందని అనర్హులకు మాత్రం సంక్షేమ ఇవ్వలేమని ముఖ్యమంత్రి మొదటి నుంచి చెబుతున్నారని మంత్రి కారుమూరి అన్నారు. ఇటీవల లబ్ధిదారులు కొందరికి నోటీసులు వచ్చాయని వారిలో ఇన్‌కంట్యాక్స్ కట్టేవారితో పాటు, 1000 చదరపు అడుగులు కంటే ఎక్కువ ఇళ్లు ఉన్నవారు, కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి మాత్రమేనన్నారు. ఇందులో కూడా అర్హులుంటే తిరిగి పునరుద్ధరించామని చెప్పారు. ఇది అలుసుగా తీసుకుని పింఛన్లు తీసేస్తున్నారని టీడీపీ, పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తుండడం హాస్యాస్పదమన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు శవరాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఇరుకు సందుల్లో సభలు నిర్వహించి 13 మందిని పొట్టనపెట్టుకున్నాడని అన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పింఛన్లు, రైస్ కార్డులను లబ్ధిదారులకు మంత్రి స్వయంగా అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షులు పోలేపల్లి వెంకట ప్రసాద్ (పీబీఆర్), ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, నూకల కనకదుర్గ, మెహర్ అన్సారీ, అడ్డా బాబు, బోడపాటి వీర్రాజు, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

చీఫ్ సెక్రటరీ దిశానిర్దేశం



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఉగాది నాటికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పూర్తిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టేజ్ కన్వర్షన్‌పై ఫొటోలు పెట్టాలని చీఫ్ సెక్రటరీ డా.కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్లకు సూచించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి స్పందన, రెవెన్యూ, రీసర్వే, అగ్రికల్చర్, హార్టికల్చర్, హౌసింగ్, గ్రామ/వార్డు సచివాలయాలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఉగాది నాటికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పూర్తిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టేజ్ కన్వర్షన్‌పై ఫొటోలు పెట్టాలని సూచించారు. రబీ సీజన్ ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. పీఎం కిసాన్ పథకం అర్హులైన రైతులకు వర్తించేందుకు వీలుగా రైతుల నుంచి ఈకేవైసీ తప్పకుండా చేయించాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హుల ఎంపిక, పరికరాల అమరికపై పూర్తి లక్ష్యం పెట్టుకోవాలన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో జీవనోపాధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించాలన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

ఆయా జిల్లాల్లో జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జాషువా, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ మహేశ్వరరావు, డ్వామా పీడీ రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటిసరఫరా శాఖ ఎస్ఈ రామస్వామి, పశుసంవర్ధక శాఖ జేడీ డా.కె.మురళీ కృష్ణ , హార్టికల్చర్ జిల్లా అధికారి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో చెస్ పోటీలు



చెస్ పోటీల ఆహ్వాన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్స్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 20, 21 తేదీలలో అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తోట భోగయ్య, మాదాసు కిషోర్ తెలిపారు. చెస్ టోర్నమెంట్ ఆహ్వాన బ్రోచర్లను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలకు పైనే భీమవరం పట్టణంలో చెస్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఎన్నో టోర్నమెంట్లు నిర్వహించి ఎంతోమంది చెస్ క్రీడాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు జనవరి 27 నుంచి 31 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు మన రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని భోగయ్య, కిషోర్ అన్నారు. భీమవరం విశ్వకవి స్కూల్లో నిర్వహించే ఈ పోటీలు అండర్ 7, 9 ,11, 13, 15, 17, బాలికలు బాలుర గ్రూపులుగా నిర్వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 15వ తేదీ లోపు అనసూయ అకాడమీ భీమవరంను గానీ 9063224466 నెంబర్‌ను గాని సంప్రదించాలని తెలిపారు.

మహిళలే నిర్ణేతలు

ఉమ్మడి పశ్చిమలో మహిళా ఓటర్లే అధికం



ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో మహిళా ఓటర్లు ఎన్నికల్లో విజేతల్ని నిర్ణయించడంతో కీలక పాత్ర పోషించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల చేశారు. జిల్లాల వ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో.. పశ్చిమ గోదావరి జిల్లాలో 14,42,471 మంది ఓటర్లు ఉంటే, ఏలూరు జిల్లాలో 15,86,077 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓటర్లలో ఏలూరు జిల్లాలో 7,78,850 మంది పురుష ఓటర్లు ఉండగా, 8,07,114 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 113 మంది ఉన్నారు.

రెండు జిల్లాల్లోను మహిళల ఆధిపత్యం

పశ్చిమ గోదావరి జిల్లాలో 7,07,411 మంది పురుష ఓటర్లు ఉండగా, 7,34,959 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 101 మంది ఇతరులు ఉన్నారు. సర్వీసు ఓటర్లను పరిశీలిస్తే పశ్చిమగోదావరి జిల్లాలో 843 మంది పురుషులు, 30 మంది మహిళలు కలిపి మొత్తం 873 ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 650 మంది పురుషులు, 25 మంది మహిళలు మొత్తం కలిపి 675 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లు, సాధారణ ఓటర్లు మొత్తం కలుపుకుని ఏలూరు జిల్లాలో 15,86,752 మంది ఓటర్లు ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో 14,43,344 ఓటర్లు ఉన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలు తమను పాలించే నేతల గెలుపు అవకాశాల్ని నిర్ణయించనున్నారు. తమ ఓటు హక్కుతో ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా :

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆచంట	87,401	89,526	2	1,76,929
పాలకొల్లు	94,445	97,911	14	1,92,370
నరసాపురం	81,524	81,892	2	1,63,418
భీమవరం	1,21,043	1,27,590	47	2,48,680
ఉండి	1,08,757	1,12,618	14	2,21,389
తణుకు	1,13,010	1,19,073	4	2,32,087
తాడేపల్లిగూడెం	1,02,074	1,06,379	18	2,08,471
మొత్తం	7,08,254	7,34,989	101	14,43,344

ఏలూరు జిల్లా :

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉంగుటూరు	99,809	1,01,962	3	2,01,774
దెందులూరు	1,10,108	1,14,038	10	2,24,156
ఏలూరు	1,05,895	1,16,074	31	2,22,000
పోలవరం	1,18,225	1,25,235	8	2,43,468
చింతలపూడి	1,30,073	1,32,182	44	2,62,299
నూజివీడు	1,16,454	1,17,189	11	2,33,654
కైకలూరు	98,936	1,00,459	6	1,99,401
మొత్తం	7,79,500	8,07,139	113	15,86,752

సర్వే పనుల పరిశీలన



సర్వే పనుల పరిశీలన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం రీ సర్వే రెండవ విడత ఈ నెల 10 నుంచి మొదలు పెట్టి సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. వీరవాసరం మండలం అండలూరులో గురువారం రెండో విడత రీ సర్వేలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా అధికారుల ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు తీసుకున్నారు. రెండవ విడతలో డ్రోన్ సర్వే పనులు కలెక్టరు, జాయింటు కలెక్టరు జేవీ మురళి పరిశీలించారు. కలెక్టరు మాట్లాడుతూ మొదటి విడతలో రీ సర్వే పనులు నూరుశాతం పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఈ నెల 10 నుంచి డ్రోన్ ద్వారా రీ సర్వే రెండో విడత పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ముందుగా అన్ని గ్రామాల గ్రౌండు కంట్రోల్ పాయింట్లు తీసుకుని 10 నుంచి పనులు మొదలు పెట్టాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు జేవీ మురళి, సర్వే అధికారి జాషువా, సర్వే ఆఫ్ ఇండియా అధికారి కె.భాస్కర రావు, తహసీల్దారు ఎం.సుందర రాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్తూరు ఘటనపై డిప్యూటీ సీఎం కొట్టు సంతాపం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం సంతాపం తెలిపారు. క్వారీ నిర్వాహకులు కంకర తవ్వి దానిని చెరువుగా మార్చారని వారిపై చర్యలు తీసుకుంటారా అని విలేకరులు ప్రశ్నించగా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. అగ్నిమాపక సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించాని మరో విలేకరి ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ వివరాలు తెలుసుకుకుని చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

నిర్వాసితుల నుంచి వినతుల స్వీకరణ

పోలవరం రూరల్: నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వాసితుల నుంచి ఆర్ అండ్‌ఆర్ ప్రత్యేక అధికారి పీవీ ప్రవీణ్ ఆదిత్య గురువారం వినతులు స్వీకరించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల పోలవరం మండలంలో ముంపునకు గురైన 26 గ్రామాల్లో నష్టపరిహారం అందని కొందరి నుంచి వారి సమస్యలను తెలుసుకున్నారు. చెట్ల నష్టపరిహారం, పాత ఇళ్ల నష్ట పరిహారం తదితర సమస్యలు ఉన్న నిర్వాసితులు వారి సమస్యలను ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువచ్చారు. నిర్వాసితుల సమస్యలను ప్రవీణ్ ఆదిత్య సానుకూలంగా విని, పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.ఝాన్సీ రాణి, తహసీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- 8 నెలల క్రితం జైలు నుంచి బయటకు..
- తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా మళ్లీ చోరీలు
- రూ.10 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ వెల్లడి


ఏలూరులో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: తాళాలు వేసి ఇళ్లే లక్ష్యంగా చోరీలు చేస్తున్న అంతర్ జిల్లా నేరస్తుడిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. స్థానిక పోలీసు జిల్లా ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఏలూరు టూటౌన్ పరిధిలో పవర్‌పేట, రెల్లివీధి, కొత్తపేట, గన్‌బజార్ ప్రాంతాల్లో గత నాలుగు నెలలుగా ఇళ్ల తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. సుమారుగా 11 ఇళ్లలో బంగారు, వెండి వస్తువులు చోరీ కావటంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పర్యవేక్షణలో ఏలూరు సీసీఎస్, టూటౌన్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసులపై పరిశోధన చేశారు. చోరీలన్నీ రైల్వేస్టేషన్, పాతబస్టాండ్ సమీప ప్రాంతాల్లో జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లో పోలీస్ గస్తీని పెంచారు. ఏలూరు సీసీఎస్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఏలూరు టూటౌన్ ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను అనేక చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

జైలుకు వెళ్లివచ్చినా మారని తీరు

తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా జగిత్యాల గ్రామానికి చెందిన చెన్నూరి రాకేష్ అలియాస్ రాకీ ప్రస్తుతం కోనసీమ జిల్లా రాజోలు మండలం చింతపల్లి గ్రామంలో ఉంటున్నాడు. రాకేష్ కేవలం 7వ తరగతి మాత్రమే చదువుకుని చెడు అలవాట్లకు బానిసగా మారాడు. గతంలో మరో ముగ్గురితో కలిసి రాజమండ్రి, భీమవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ తదితర ప్రాంతాల్లో 18 నేరాలు చేసినట్లు కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులో జైలు శిక్ష సైతం అనుభవించి 8 నెలల కిత్రం బయటకు వచ్చాడు. ముఠాగా నేరాలకు పాల్పడితే దొరికిపోతున్నామనే భావనతో ఒక్కడే నేరాలకు పాల్పడుతున్నాడు. గత నాలుగు నెలలుగా ఏలూరు, పాయకరావుపేటలో చోరీలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల చేసిన చోరీల్లో దోచుకున్న సొత్తును విక్రయించగా మిగిలిన 25 కాసుల బంగారు ఆభరణాలు, 1 సెల్ ఫోన్, రూ.9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన బంగారు ఆభరణాల విలువ సుమారుగా రూ.10 లక్షలు వరకూ ఉంటుందని అంచనా. ఈ కేసు ఛేదనలో విశేష కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఉన్నారు.

నరసాపురంలో జైనుల ఆందోళన


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జైన్ సంఘం నాయకులు

నరసాపురం: జైనుల పుణ్యక్షేత్రం శ్రీ సమ్మద్ శిఖరాజిని జార్ఖండ్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా మార్చడంపై జైన్ సంఘం ఆధ్వర్యంలో జైనులు గురువారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. జైన్ గురువులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలో హిందువులు, సిక్కులు, ముస్లింలకు అనేక పవిత్ర స్థలాలు ఉన్నాయని చెప్పారు. అలాగే జార్ఖండ్‌లోని శ్రీసమ్మద్ శిఖరాజి ప్రాంతాన్ని జైన్‌లు శాశ్వత పవిత్ర స్థలంగా భావిస్తారన్నారు. అలాంటి స్థలాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించడం అక్కడి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా జైన్‌లు ఆందోళనలు చేస్తున్నారన్నారు. తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. జైన్ గురువులు సిద్ద రతన్, విజయ్‌రతన్, నరసాపురం జైన్‌సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రకుమార్ జైన్, మనోకుమార్ జైన్, లలిత్ జైన్, వినోద్‌కుమార్ జైన్, కిషోర్ జైన్, చంపాలాల్ జైన్ పాల్గొన్నారు.

కొల్లేరు మత్స్య సంపద భేష్


చేపల పెంపకం, చేపల పట్టుబడులను పరిశీలిస్తున్న నెల్లూరు మత్స్య కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు

- నెల్లూరు మత్స్య కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు
- కొల్లేరు ప్రాంతాల్లో చెరువులు, హేచరీల సందర్శన

ఆకివీడు: కొల్లేరు సరస్సు పరీవాహక ప్రాంతంలో మత్స్య సంపద భేష్‌గా ఉందని నెల్లూరు మత్స్య కళాశాల విద్యార్థులు ప్రొఫెసర్లు అన్నారు. కొల్లేరు, పశ్చిమగోదావరి జిల్లాలో మత్స్య ఉత్పత్తుల పరిశీలన నిమిత్తం గురువారం ఆకివీడు, కొల్లేరు ప్రాంతాల్లో చెరువులు, హేచరీలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తులకు నిలయంగా కొల్లేరు ప్రాంతం ఉందన్నారు. చేపల పెంపకం, రొయ్యల పెంపకం పెద్ద మొత్తంలో జరుగుతోందన్నారు. రెండు కేజీల నుంచి ఐదు కేజీల వరకూ చేపల్ని పెంచడం ఆశ్చర్యంగా ఉందని విద్యార్థిని మానస తెలిపారు. సీడ్ నుంచి మేత, పట్టుబడులను పరిశీలించామని చెప్పారు. అన్నింటికీ అనువైన నేల ఉన్నందున చేపల పెరుగుదల ఆశాజనకంగా ఉందన్నారు. ఇక్కడి విధానాలపై తమకు ఎంతో అవగాహన ఏర్పడిందన్నారు. మత్స్య పరిశోధన విశ్వ విద్యాలయం (ఎఫ్ఆర్ఎస్) శాస్త్రవేత్త ఎన్‌వీ రావు మాట్లాడుతూ హేచరీలలో చేప పిల్లలు, రొయ్య పిల్లల ఉత్పత్తిని వివరించారు. రొయ్యలు, చేపల్లో వచ్చే వ్యాధుల్ని విద్యార్థులకు వివరించారు. నెల్లూరు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తి మాట్లాడుతూ తమ కళాశాల నుంచి 32 మంది విద్యార్థులను క్షేత్రస్థాయిలో మత్స్య ఉత్పత్తుల్ని పరిశీలించేందుకు మూడు రోజుల పాటు కొల్లేరు తీర ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చామని చెప్పారు. హేచరీలు, చేపల పెంపకం, ఫీడ్ ప్లాంట్‌లను పరిశీలిస్తున్నామని చెప్పారు. మత్స్య ఉత్పత్తులను విద్యార్థులు స్వయంగా తిలకించేందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో మత్స్య కళాశాల ప్రొఫెసర్ త్రివేణి, కేవీకే డైరెక్టర్ నంద్యాల చల్లారావు, స్థానిక చేపల వ్యాపారి ఎండీ అలీ తదితరులు విద్యార్థులకు సహకరించారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు 7 వరకు గడువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 7వ తేదీ వరకు గడువు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కోరే అభ్యర్థులు తత్కాల్ పద్ధతిలో పదో తరగతికి రూ.400, ఇంటర్మీడియట్‌కు రూ.500 అపరాధ రుసుము చెల్లించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ, నగదు చెల్లింపులు ఏపీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందని, ఏమైనా సందేహాలు ఉంటే తమ సమీపంలోని ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీ సెంటర్లలో లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

ఇంటింటా సంతృప్తి


మొగల్తూరు : కాళీపట్నం తూర్పు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్‌ను అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


యలమంచిలి : యలమంచిలి లంక గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్

గ్రూప్-1 పరీక్షకు పక్కా ఏర్పాట్లు

- 8న ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ
- ఏలూరు జిల్లాలో 6 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 3,106 మంది అభ్యర్థులు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణపై సర్వీసు కమిషన్ అధికారులు, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ పరీక్షలకు 3,106 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపరు-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పేపరు-2 పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం జరిగే పరీక్షకు 9.45 గంటలలోపు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.45 గంటల లోపు అభ్యర్థులు హాల్‌టికెట్, ప్రభుత్వం గుర్తించిన ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం 94901 72109, 9491 041436 నంబర్లతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సర్వీస్ కమిషన్ సూచించిన మార్గదర్శకాలను లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఒకటికి రెండు సార్లు పూర్తి పరిశీలన చేయాలన్నారు. గర్భిణులు, అంధులు, వివిధ ప్రతిభావంతుల అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోని భవనం కింది అంతస్తులోనే పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జేసీ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ ఈ పరీక్షలకు సీనియర్ జిల్లా అధికారులను లైజన్ అధికారులుగా నియమించామని, పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (కోడ్ 112801), వట్లూరు రైల్వేగేట్ సమీపంలోని సీఆర్ఆర్ పాలిటెక్నికల్ కళాశాల (కోడ్ 112802), వట్లూరు ఫ్లైఓవర్ సమీపంలోని సీఆర్ఆర్ మహిళా కళాశాల (కోడ్ 112803), ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల (కోడ్ 112804), ఏలూరు మోర్ మార్కెట్ రోడ్డులోని నారాయణ బాలుర జూనియర్ కళాశాల (కోడ్ 112805), వట్లూరు ఫ్లైఓవర్ సమీపంలోని సీఆర్ఆర్ మహిళా జూనియర్ కళాశాల (కోడ్-112806)ను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. డీఆర్వో, పరీక్షల సమన్వయ అధికారి ఏపీఎస్ఎస్ మూర్తి, ఏపీపీఎస్‌ఈ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.వెంకట సుబ్బయ్య, సెక్షన్ అఫీసర్లు ఐ.పద్మలలిత, ఎన్.అంజమ్మ, లైజన్ అధికారులు ఏలూరు ఆర్డీఓ కె.పెంచలకిషోర్, డీసీఓ టి.ప్రవీణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ జేడీ ఎస్.మధుసూదనరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ డి.రాంబాబు, డీఎస్పీలు కృష్ణంరాజు, పైడేశ్వరరావు, ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డా.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మిర్చిలో ఉధృతంగా 'నల్ల తామర'


వలసపల్లిలో మిర్చి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్, ఏఓ, రైతులు

ముసునూరు: మిర్చి పంటను ఆశించిన నల్ల తామర పురుగు నివారణకు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఫణికుమార్ రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులతో కలసి వలసపల్లిలోని మిర్చి తోటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వందలాది ఎకరాల్లో సాగులో ఉన్న మిర్చి తోటల్లో నల్ల తామర పురుగు ఉధృతంగా ఉందన్నారు. నల్ల తామర నివారణకు తీసుకోవాల్సిన తక్షణ సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. జిగురు పూసిన పసుపు, నీలం రంగు అట్టలను పెట్టడం ద్వారా తల్లి పురుగుల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. పంటలకు నష్టం వాటిల్లితే ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలలో వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆలా ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

జంగంగూడెంలో కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ

నూజివీడు: మండలంలోని జంగంగూడెంలో కౌలు రైతు మింది తవిటయ్య బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్, డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్, ఏడీఏ విద్యాసాగర్ గురువారం విచారణ నిర్వహించారు. మింది తవిటయ్య గత నెల 27వ తేదీ అర్ధరాత్రి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మృతుడి ఇంటికి వెళ్లిన అధికారులు, తవిటయ్య సాగు చేసిన భూమి, పంట వివరాలు, అప్పులు తదితర వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కౌలు ఇచ్చిన భూ యజమానులను, మృతుడుకి అప్పు ఇచ్చిన వ్యక్తులను సోమవారం మూడు గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు రావాలని కోరారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్లూరి అశోక్, రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ ఉన్నారు.

క్లుప్తంగా

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు రమాదేవి

పెంటపాడు: మహిళలు విద్యతో పాటు, అన్ని రంగాలలో ఆర్థికంగా, సామాజిక రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆడిటోరియంలో మహిళా సాధికారత విభాగంలో విద్యార్థినులకు అధ్యాపకురాలు రమాదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ, సమాజిక, ఆర్థిక విషయాల్లో మహిళలు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాథమెటిక్స్ టాపర్‌గా నందిని రెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2014–16 సంవత్సరంలో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థి సత్తి నందిని రెడ్డి 2021లో పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంఎస్సీ మ్యాథమెటిక్స్‌లో పద్మావతి మహిళా యూనివర్శిటీ (తిరుపతి) నుంచి టాపర్‌గా 93 శాతం మార్కులతో నిలిచారు. ఇంటర్ చదువుతున్న రోజుల్లో లెక్కలు అధ్యాపకులుగా పనిచేసిన పులుగు దీపక్ శిక్షణలో, అనంతరం ఆయన ఇచ్చిన కోచింగ్ కారణంగా ఈ ఉన్నతి సాధించినట్లు నందిని రెడ్డి వెల్లడించారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న గుడ్ ల్యాంప్ నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గుడ్ ల్యాంప్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.అశోక్ కుమార్ ఎ.ఎన్.డబ్ల్యూ మణిమాల, ఓఆర్‌డబ్ల్యూ సుహాసినీ, వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ ఆదేశాలు మేరకు గుడ్‌ల్యాంప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'హెచ్‌ఐవీ స్థితి మీకు తెలుసా' అనే అంశంపై గురువారం అవగాహన చేశారు. పట్టణంలో పలు ప్రాంతాలలోని ప్రజలకు తగు సూచనలు, జాగ్రతలు తీసుకోవాలని కోరారు.

తణుకులో జైనుల నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న జైన్‌లు

తణుకు అర్బన్: జైనుల పుణ్యక్షేత్రం శ్రీ సమ్మద్ శిఖరాజిని జార్ఖండ్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా మార్చడంపై జైన్ సంఘం ఆధ్వర్యంలో జైనులు గురువారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. జైన్ గురువులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైన్ సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలో హిందువులు, సిక్కులు, ముస్లింలకు అనేక పవిత్ర స్థలాలు ఉన్నాయని చెప్పారు. అలాగే జార్ఖండ్‌లోని శ్రీసమ్మద్ శిఖరాజి ప్రాంతాన్ని జైన్‌లు శాశ్వత పవిత్ర స్థలంగా భావిస్తారన్నారు. అలాంటి స్థలాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించడం అక్కడి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా జైన్‌లు ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జైన్‌లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

భీమవరం అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు బి. వెంకటేశ్వర్లు అన్నారు. అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గూట్ల జ్యోతి కుమారికి బ్రెయిన్ శస్త్రచికిత్స చేశాక వికటించడంతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జ్యోతికుమారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాతలు స్పందించి ఆమెకు సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎమ్‌సీ చైర్మన్ గూడపాటి మిల్టన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చి క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని 21వ వార్డులో ఉన్న ప్రవచన దేవుని సంఘం క్రిస్టియన్ క్యాలెండర్‌ను దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలో ఉన్న దేవుని వాక్యాలను క్యాలెండర్‌లో పొందుపర్చడం అభినందనీయమని అన్నారు. పాస్టర్ కె.శ్రీధర్, వర్ధనపు పాలురాజు, బట్టు సతీష్, ఎస్. మోజెస్, సాదె మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



అత్తిలిలో కొత్తగా మంజూరైన పెన్షన్, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అత్తిలి: అర్హతే ప్రామాణికంగా తీసుకొని కులమతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. గురువారం అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో కొత్తగా మంజూరైన పెన్షన్లు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందించే పరిస్థితి ఉండేదన్నారు. నేడు దళారీల ప్రమేయం లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటిలోనూ అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గతంలో పింఛన్లు పొందాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు నేరుగా ఇంటింటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నామన్నారు. జగనన్న ప్రతి రూపాయిని పేదల కోసం ఖర్చుచేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో 34 లక్షల మందికి పెన్షన్‌లు ఇస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దానికి రెట్టింపు సంఖ్యలో 64 లక్షల మందికి పెన్షన్‌లు అందజేస్తున్నారని వివరించారు. చంద్రబాబు హయాంలో అప్పులు తెచ్చి ఆ మొత్తాన్ని తండ్రీకొడుకులు దోచుకో, దాచుకో అన్నట్లు వ్యవహరించారని మంత్రి ఎద్దేవా చేసారు. చంద్రబాబు శవ రాజకీయాలు చేస్తున్నారని, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారని దుయ్యబట్టారు. జనాన్ని చంపే అధికారం చంద్రబాబుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా దత్తపుత్రుడు నోరుమెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అత్తిలి మండలంలో కొత్తగా 298 మందికి పింఛన్‌లు, 167 మందికి రేషన్‌కార్డులు మంజూరు కావడంతో వాటిని లబ్ధిదారులకు అందజేసామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, అత్తిలి మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, సర్పంచ్‌లఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, బీసీసెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, బూత్‌కన్వీనర్ల అధ్యక్షుడు గారపాటి నాగరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, వైస్ ఎంపీపీ దారం శిరీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల పండుస్వామి, వేగేశ్న ధనసత్యనారాయణరాజు, కంకటాల సతీష్, సబ్బితి రాజేష్, తానుకొండ దయామణి, బుడితి సుజన్‌కుమార్, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

7న చినతాడేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చిన తాడేపల్లి సచివాలయంలో ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమత్తులు నిమిత్తం ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు సౌత్ ఏఈ జి.మురళీ గురువారం తెలిపారు. పెంటపాడు, మండలంలోని తాళ్ళముదునూరు పాడు, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యతో భవితకు భరోసా



ఉపకరణాలు అందజేస్తున్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పిస్తే వారి భవిష్యత్తుకు భరోసా లభిస్తోందని వైఎస్సార్ సీపీ యువనాయకులు, యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. గురువారం ఐదోవ వార్డు ఇన్‌ఛార్జి యార్ల అనిల్ కుమార్ సహకారంతో దివ్యాంగుల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు, వీల్ చైర్స్, రో లేటర్స్, ట్రై సైకిల్స్, సీపీ చైర్స్, సంకక్రలు, వినికిడి యంత్రాలు అందజేశారు. విశాల్ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమాలను వెల్లడించారు. జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద, ట్యాబ్స్, ఉపకరణాలు ఉచితంగా అందజేస్తున్నారని కొనియాడారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ మండల స్థాయిలో 31 మందికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాలు అందజేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సాయి బాబా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జ్యోతి, దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మండపాకలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అధికారులు, నాయకులు

తణుకు టౌన్: జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తణుకు రూరల్ మండలం మహాలక్ష్మి చెరువు గ్రామానికి చెందిన లబ్ధిదారులు గురువారం ఒక్క రోజే 24మంది సామూహికంగా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. తణుకు మండలంలోని మహాలక్ష్మి చెరువు, యర్రాయి చెరువు, వేల్పూరు, మండపాక గ్రామాలకు చెందిన పేదలకు మండపాక గ్రామంలోని వేర్వేరు చోట్ల ప్రత్యేకంగా లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్ 3 కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏజెన్సీ ద్వారా నిర్మించేందుకు ముందుకు రావడంతో ఆ ఏజెన్సీ ద్వారా గురువారం ఇళ్ల నిర్మాణం చేయించుకునేందుకు గురువారం ఒక్క రోజే 24 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చి తమ నిర్మాణానికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే స్ఫూర్తితో ఉగాదిలోపు 300 ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వేల్పూరు లేఅవుట్‌లో విద్యుద్దీకరణ పనులు పూర్తి

మండపాక గ్రామంలో వేల్పూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన లేవుట్‌లో విద్యుత్ లైన్ పనులను పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గురువారం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభాలను అధికారులు పరిశీలించారు.

జగనన్న పథకాలపై దుష్ప్రచారం మానుకోవాలి



వలంటీర్లకు దుస్తులు అందజేస్తున్న కొట్టు విశాల్

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని వైసీపీ యువనేత కొట్టు విశాల్ తెలిపారు. పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో గురువారం ఆమె నివాసం వద్ద వలంటీర్లకు, ఆశా వర్కర్లకు, డ్వాక్రా సీసీలకు, పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశాల్ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న వలంటీర్లు, డ్వాక్రా సీసీలు, ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల ద్వారా అందరికి పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో వృద్ధులు, వికలాంగులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఏ ఒక్కరికీ అర్హత ఉండి పింఛన్ అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కొవ్వూరి బాస్కరరెడ్డి, కొలుపూరి శివకిరణ్, బర్ల జైబాబు, దేవాబత్తుల బాబి, తాడేపల్లి ఈశ్వరరావు, బొడ్డు సాయిబాబా, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, ఉండ్రావరపు గోపి, వెలనాటి సత్తిబాబు, శాంతకుమార్, పెంటపాడు జైభీమ్‌యూత్ సభ్యులు, పంచాయతీ వార్డు సభ్యులు, ఎస్సీసంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



పెంటపాడులో కాలిపోయిన కాసారపు లక్ష్మి ఇంటిని పరిశీలిస్తున్న కొట్టు విశాల్

పెంటపాడు: ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సందర్భంలో బాధితులను ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. పెంటపాడు శెట్టిబలిజపేటలో 1వ వార్డు సభ్యులు కాసారపు శ్రీను, కాసారపు లక్ష్మిలకు చెందిన ఇల్లు ఈనెల 2న దగ్ధం కాగా రూ. 5 లక్షలు నష్టం సంభవించింది. ఆ కుటుంబాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తరపున యువనేత కొట్టు విశాల్ గురువారం పరామర్శించి కారణాలు అడిగి తెలుసుకొన్నారు. బాధితులను న్యాయం చేసే విధంగా కృషి చేయనున్నట్లు విశాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బాస్కరరెడ్డి, తాడేపల్లి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవాలు



ఆకుతీగపాడు గ్రామంలో ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న కొట్టు విశాల్

పెంటపాడు: మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో ముత్యాలమ్మ ఉత్సవాలు బుధవారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరిగుడి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. వైఎస్సార్ సీపీ యువనాయకులు కొట్టు విశాల్ అమ్మవారిని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు.

రావిపాడులో:

రావిపాడు గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పూడిగుడిసె వద్ద ప్రత్యేక పూజలు చేసారు. సంక్రాంతి వరకు ఈ రెండు గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

దర్శిపర్రులో ముగిసిన పుంతలో ముసలమ్మ ఉత్సవాలు: మండలంలోని దర్శిపర్రు గ్రామంలో జనవరి 1 నుంచి వైభవంగా ప్రారంభమైన గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: అదుపుతప్పి ట్రాక్టర్ పంటకాలువలోకి పడిన ఘటనలో డ్రైవర్ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొడవటి మోహనరావు (49) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పంట కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మోహనరావు కాళ్లపై ట్రాక్టర్ వీల్స్ పడిపోవడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. గుత్తుల సత్యనారాయణ అనే వ్యక్తి మోహనరావును తాడేపల్లిగూడెం ట్రినిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు కాళ్లను తొడల వరకు తొలగించారు. చికిత్స నుంచి కోలుకోలేక గురువారం ఉదయం మోహనరావు మృతి చెందినట్లు అతని భార్య మరియమ్మ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.10.33 లక్షల విరాళం

సాక్షి, భీమవరం : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో ఉన్న శ్రీ సీతా రామలింగేశ్వర స్వామి పురాతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రూ.10.33 లక్షలు విరాళంగా అందచేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆలయ అధికారులకు చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రభుత్వం ద్వారా రూ.కోటి నిధులను మంజూరు చేశారన్నారు. భక్తుల భాగస్వామ్యంగా మూడో వంతు నిధులు రూ.33.33 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉండడంతో, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్వయంగా కల్పించుకుని రూ.23 లక్షల వరకు భక్తుల నుంచి సేకరించినట్లు చెప్పారు. మిగిలిన రూ.10.33 లక్షలు తన కుటుంబ సభ్యుల పేరిట ఎమ్మెల్యే ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు తోట శ్రీనివాసరావు, కిషోర్, ఆలయ పాలకమండలి చైర్మన్ మందారపు శ్యాంసుందర్రావు, తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం సాధ్యం



టోర్నీ ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న సీఐ నాగరాజు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడలతోనే మానసిక ఆరోగ్యం సాధ్యపడుతుందని సీఐ ఎస్ఎస్‌వీ నాగరాజు తెలిపారు. తాడేపల్లిగూడెం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతు బజార్ ఇండోర్ స్టేడియంలో గురువారం షెటిల్ టర్నోమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో ఈ షెటిల్ పోటీలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అండర్ 19 మెన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు, ఉమెన్ అండర్ 19 సింగిల్స్, వివిధ వయస్సుల వారీగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ గేమ్స్ ఆడటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం బాగుటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, టోర్నీ నిర్వాహక అధ్యక్షుడు ముద్దం హరి, సెక్రటరీ పి.భుజంగం, కోశాధికారి బాలాజీ, జాయింట్ సెక్రటరీ సోముబాబులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యునిగా మందలపర్తి కిషోర్



మందలపర్తి కిషోర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీనియర్ పాత్రికేయులు, కవి, సాహిత్య విమర్శకులు మదలపర్తి కిషోర్ కేంద్ర సాహిత్య అకాడమీ పాలక మండలి సభ్యులుగా నియమితులయ్యారు. సమాచార కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఒక లేఖలో తెలిపినట్లు సీనియర్ పాత్రికేయులు దూసనపూడి సోమసుందర్ గురువారం హర్షం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్య అకాడమీకి కొత్త పాలక మండలిని నియమించగా ఐదేళ్ళపాటు సభ్యులుగా కిషోర్ ఉంటారని తెలిపారు. సాక్షి తదితర అనేక పత్రికల్లో కిషోర్ వివిధ హోదాలలో పనిచేశారని వెల్లడించారు. పత్రికా రంగంలో అప్పగించిన అనేక బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కిషోర్ నియామకంతో పత్రికా రంగానికి, సాహితీ రంగానికి నాలుగున్నర దశాబ్ధాల పాటు చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించినట్లయ్యిందని సోమసుందర్ వివరించారు.

8 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

భీమవరం (ప్రకాశం చౌక్) : త్యాగరాజ స్వామి 175వ వర్థంతిని పురస్కరించుకుని త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో ఈనెల 8 నుంచి 12 వ తేదీ వరకు 104వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి కారుమూరి ఆదిత్య, ఉపాధ్యక్షుడు గన్నబత్తుల శ్రీనివాస్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో త్యాగరాజ భవనంలోను, 11,12 తేదీల్లో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలోను ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీ ఉదయం స్వామివారి ఊరేగింపు, సాయంత్రం వేందంతం రామలింగ శాస్త్రి బృందం 20 మందితో నృత్య రూపకం (నర్తనశాల), 9న కాంచన సిస్టర్స్ వారిచే గాత్రం, 10న వివేక్ సదా శివమ్ వారిచే గాత్రం, 11న దివి లిఖిత సాయి మృదంగం విన్యాసం, మేగిలిచర్ల నాగమణి భగవతారణి హరికథ, 12న త్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగ సాయి, చెరుకువాడ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: కోడి పందేలు, జూదాలకు యువత దూరంగా ఉండి, సంప్రదాయ క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలసి మంత్రి కారుమూరి క్రికెట్ ఆటలను ఆడారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ యువత కోడి పందేలు, కోతాట, గుండాట వంటి ప్రభుత్వ నిషేధిత ఆటలకు దూరంగా దూరంగా ఉండాలని కోరారు. యువత క్రీడల పట్ల దృష్టి సారించి క్రీడలలో మెరుగైన ఫలితాలను సాధించాలని కోరారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఇరు జట్లకు మంత్రి కారుమూరి నగదు బహుమతులను అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో సీఐ ముత్యాల సత్యనారాయణ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌లో..

తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో తణుకు రోటరీ క్లబ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈపోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బసవ రామకృష్ణ, కార్యదర్శి జీ సుధాకర్, మల్లిన రామచంద్రరావు, డా. కే సత్యనారాయణరాజు, సీహెచ్ వెంకటేశ్వరరావు, మహిళలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.